ప్రజాశక్తి

బుధవారం 6 డిసెంబరు 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో నీట మునిగిన వరి పనలు

మిచౌంగ్

పంజా



చెరువును తలపిస్తున్న బందరు ప్రధాన రహదారి

- 1.86 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం
- కూలిన చెట్లు
- దెబ్బతిన్న 71 గృహాలు
- విరిగిన 111 విద్యుత్ స్తంభాలు
- విద్యుత్‌కు అంతరాయం
- 24 విమానాలు రద్దు
- విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి
- జనజీవనం అస్తవ్యస్తం
- 67 పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- 3,305 మంది తరలింపు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో మంగళవారం కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులలకు ఉమ్మడి కృష్ణాజిల్లా అతలాకుతలమైంది. జనజీవనం స్తంభించింది. పంటలకు అపారనష్టం సంభవించింది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం కృష్ణాజిల్లాలో 1,72,550 ఎకరాల్లో, ఎన్టీఆర్ జిల్లాలో 12,628 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో విద్యుత్ శాఖకు రూ.34.56 లక్షల నష్టం వాటిల్లింది. 15 మండలాల్లో 111 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 44 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 71 గృహాలు దెబ్బతిన్నాయి. మచిలీపట్నం మండలంలో అత్యధికంగా 55 గృహాలు, విజయవాడ, అవనిగడ్డ, కంకిపాడుల్లో 3 చొప్పున, నాగాయలంక, కోడూరు, కృత్తివెన్నుల్లో 2 చొప్పున, పమిడిముక్కలలో ఒకటి చొప్పున మొత్తం 71 గృహాలు దెబ్బతిన్నాయి. రోడ్లకు అడ్డుగా చెట్లు పడిపోయాయి. బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామంలో దుకాణం తెరుస్తుండగా విద్యుత్‌షాక్‌గురై జొన్నల చిట్టిబాబు (43) మృతి చెందాడు. పాల ప్యాకెట్ కోసం తన బడ్డీ కొట్టు ఇనుప డోర్ తీస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. గన్నవరం విమానాశ్రయానికి వివిధ ప్రాంతాల నుండి రావాల్సిన 24 విమాన సర్వీసులను రద్దు చేశారు. నాగాయలంక, కత్తివెన్ను, కోడూరు, చల్లపల్లి, మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మోపిదేవి మండలాలపై తుపాను తీవ్ర ఎక్కువగా ఉంది. ఆయా మండలాల్లో 67 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 3,305 మందిని తరలించారు. రహదార్లపై నీరు ప్రవహించింది. చాలా ప్రాంతాల్లో దుకాణాలు తెరవలేదు. ఆర్‌టిసిపై తుపాను ప్రభావం పడింది. జిల్లాలోని వివిధ ఆర్‌టిసి డిపోల్లో మొత్తం 445 సర్వీసులు తిరగాల్సి ఉండగా, 335 సర్వీసులు మాత్రమే తిరిగాయి. భారీ వర్షాలకు పంట కాల్వలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పొలాల్లోని నీరు బయటకు వెళ్లడం లేదు. బందరులో రోడ్లు జలమయమయ్యాయి. బస్టాండ్‌లో మోకాలిలోతు నీరు చేరింది.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



మోకాలిలోతు నీటిలో బందరు బస్టాండ్

బాధితులను ఆదుకోవాలి : సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ : తుపాను బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులు, కౌలురైతులకు పంటను బట్టి నష్టపరిహారం అందించాలని కోరారు. నిబంధనలను సడలించి తడిచిన ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయించాలని, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులకు సహాయం చేయాలని కోరారు. అధికార యంత్రాంగం వెంటనే ముంపు ప్రాంతాల్లో పర్యటించి జరిగిన నష్టంపై సమగ్ర సర్వే చేయించాలని విజ్ఞప్తి చేశారు. పనులు కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు భృతి ఇవ్వాలని, రెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.



గూడూరులో వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్



గన్నవరంలో వర్షం నీటిలో వాలిపోయిన వరి పంట



బంటుమిల్లి మండలం పెందూరులో మరణించిన జొన్నల చిట్టిబాబు



పాయకాపురంలో ముంపుకుగురైన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నేత సిహెచ్.బాబూరావు



కోడూరు పునరావాస కేంద్రంలో తుపాను బాధితులు

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ డిల్లీరావు పర్యటన

సహాయక చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్, వన్‌టౌన్ : తుపాను ప్రభావంతో మంగళవారం విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తతంగా పర్యటించారు. బెంజ్ సర్కిల్, పడమట 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, ఏపీఐఐసీ కాలనీ, గుణదల మహానాడు జంక్షన్, ఈఎస్ఐ రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, మధురానగర్ రైల్వేస్టేషన్, సింగ్ నగర్ వాంబే కాలనీ, చనుమోలు వెంకటరావు ఫ్లైఓవర్ మిల్క్ ప్రాజెక్టు, రాజరాజేశ్వరి పేట, ఎర్రకట్ట, కేదారేశ్వరపేట, సీతారాంపురం జంక్షన్ ప్రసాదంపాడు, ఎనికేపాడు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఆటోనగర్, ఏపీఐఐసీ కాలనీకి సమీపంలో గుడిసెలు వేసుకుంటూ తాత్కాలికంగా నివాసం ఉంటున్న 200 మంది వరకు వర్షాల వల్ల ఇబ్బందులు పడుతుండటంతో సమీపంలోని కళ్యాణమండపంలో ఆశ్రయం కల్పించారు. వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, మందులు తదితరాలను అందించాలని ఆదేశించారు. అలాగే కామినేనినగర్‌లో గుడిసెలు వేసుకొని ఉంటున్న దాదాపు 300 మందికి సహాయసహకారాలు అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆ ప్రాంతంలో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు ఇంజిన్లతో తోడేయించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకట రామయ్య, ఆర్ఐ నాగమల్లేశ్వరరావు, వీఆర్‌వోలు బాషా, శ్రీనివాస్, నాంచారయ్య, సత్యనారాయణ ఉన్నారు.



డ్రైనేజీ ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు జైలు

ప్రజాశక్తి - విజయవాడ : భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తూ చనిపోయేవిధంగా ప్రేరేపించిన భర్తకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మహిళా సెషన్స్ కోర్ట్, ఐదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి ఐ.శైలజా దేవి తీర్పు చెప్పారు. విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో నిందితుడైన ఆ ప్రాంతంలోని దర్గా ప్లాట్స్ ఏరియాకు చెందిన షైక్ జాన్ పాడ్ సైదులుపై నేరం రుజువుకావడంతో మంగళవారం జడ్జి శైలజా దేవి జైలు శిక్షణతోపాటు రూ.2,700 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఫిర్యాది షేక్ సుభాని కుమార్తె షేక్ హుస్నా (25)ను సైదులుకు ఇచ్చి పెద్దల సమక్షంలో 2010 ఏప్రిల్ 26న వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.2.5 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, సారే సామాన్లు ఇచ్చారు. వారికి ఇద్దరు కుమార్తెలు పుట్టారు. ఆ తర్వాత నుండి అదనపు కట్నం తీసుకురావాలని (మిగతా 6లో)

దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్
- ముంపు ప్రాంతాల్లో నేతల పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : భారీ వర్షాల కారణంగా నగరంలోని భాను నగర్‌లో ఐదు అంతస్థుల భవన నిర్మాణానికి వినియోగిస్తున్న ఇనుప పరంజా కూలిపోయి సమీపంలోని మూడు ఇళ్లు దెబ్బతిన్నాయి. తటిలో ప్రాణాపాయం తప్పింది. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, ఆస్తి నష్టం జరిగింది. సంఘటన ప్రాంతాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పలువురు సిపిఎం నేతలు పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. దెబ్బతిన్న ఇళ్లను సందర్శించి పరంజా కూలిపోవడానికి దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ పరంజా కూలిపోయి ఇళ్లు దెబ్బ తినటం విచారకరమన్నారు. ప్రభుత్వం, బిల్డరు దెబ్బతిన్న ఇళ్ల పునర్మిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈపర్యటనలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణ రావు, నాయకులు పి.కష్ణమూర్తి, ఆషా తదితరులు పాల్గొన్నారు. అలాగే భారీ వర్షాలకు నీట మునిగిన విజయవాడ నగరంలోని 62, 63, 64 డివిజన్లలోని పాయకాపురం, రాజీవ్ నగర్, ఎల్బీఎస్ నగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పర్యటించారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఈపర్యటనలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, నాయకులు సిహెచ్. శ్రీనివాస్, ఝాన్సీ, ఎన్.నాగేశ్వరరావు, స్థానిక నేతలు పి.సాంబిరెడ్డి, బొంగు రాంబాబు, జి.నాగరాజు, చంద్రశేఖర్, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తం

- పలుచోట్ల పంటలు నీట మునక
- పత్తి, మిరప తోటలు సైతం ముంపులో
- పరిశీలించిన పలువురు అధికారులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

రెండు రోజులుగా కురుస్తున్న మిచాంగ్ తుపానుతో పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి. పంటలకు అపారనష్టం చోటుచేసుకుంది. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. పాఠశాలలు, దుకాణాలు మూతపడ్డాయి. పలుచోట్ల వరదనీరు ఇళ్లల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పంటలు చేతికి వచ్చే సమయానికి తుపాను ముంచేసిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కట్టలేరు వరదను పరిశీలించిన ఎసిపి

ప్రజాశక్తి - గంపలగూడెం : రెండు రోజులుగా పడుతున్న విస్తార వర్షాలకు మండల వ్యాప్తంగా వరద నీరు పొంగుతుంది. ఈ పరిస్థితులపై మైలవరం ఎసిపి రమేష్ మంగళవారం సాయంత్రం సుడిగాలి పర్యటన చేశారు. ప్రజల అప్రమత్తతపై ఆయా పోలీస్ స్టేషన్ల ఇన్‌ఛార్జిలను ఆరా తీశారు. ఇందులో భాగంగా, స్థానిక కట్టలేరు వంతెన ప్రాంత పరిస్థితులను పరిశీలించి, సమీక్షించారు. మండలంలో ఉన్న వాగులు, వంకల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా ప్రజల క్షేమాన్ని దష్టిలో పెట్టుకొని సైక్లోన్ సమయంలో చురుకుగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.రాంబాబుకు తెలిపారు. ఈ సందర్భంలో తిరువూరు సిఐ షేక్ నభి, సిబ్బంది వున్నారు.

ఆకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం

ఇబ్రహీంపట్నం : మండలంలోని కొటికలపూడి, ఈలప్రోలు, కేతనకొండ గ్రామంలో వరి పంట పూర్తిగా నీటిలో మునిగి పోవడంతో రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. కొన్ని రోజులలో పంట ఇంటికి వస్తుంది అనుకొనే సమయంలో తుపాను ముంచేసిందంటూ సర్పంచ్ రెంటపల్లి నాగరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నది ప్రాంతంలో పైరు వేయడం వల్ల పల్లపు ప్రాంతంలో ఉండటం వల్ల వరి పంట పనికి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. అధికారులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కొటికలపూడి, ఈలప్రోలులో వరి నేలకూలింది. లవాలాయి. తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని వేడుతున్నారు. ఆకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయంలో గాలులతో పాటు వర్షం రెండు రోజుల కురుస్తున్నడటంతో వరి పైరు నెల వాలింది. వరి మొత్తం నీటిలో మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటికపూడి గ్రామంలో వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోయుందని, రైతులు తీవ్ర నష్టపోయే ప్రమాదం ఉందని గ్రామ సర్పంచ్ రెంటపల్లి నాగరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నది ప్రాంతంలో పైరు వేయడం వల్ల పల్లపు ప్రాంతంలో ఉండటం వల్ల వరి పంట పనికి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. అధికారులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

తిరువూరు : తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి కోసిన ధాన్యం తడవకుండా పట్టాలు కప్పికోవాలని మండల వ్యవసాయ అధికారి పి.పద్మ రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆమె మంగళవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి ధాన్యం రైతులకు కొన్ని సూచనలనిచ్చారు. వరి కోతలు 2 రోజులు వాయిదా వేసుకోవాలని, కోసిన ధాన్యం రైతులు అమ్మదలిస్తే కొనుగోలు చేసేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. కోసిన వరి పనలు పొలంలో ఉంటే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే ధాన్యం మొలకెత్తకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు శాంత కుమారి, ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

నందిగామ : తుపాను ప్రభావంతో ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నందిగామ పట్టణంలో పంచాయతీరాజ్ కార్యాలయ ప్రహరీ పడిపోయింది. ఆ సమయంలో గోడ పక్కన ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రహరీకూలిన ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరాం పరిశీలించారు. కూలిన గోడ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణి శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం కంచల గ్రామంలో మిచాంగ్ తుఫాను వల్ల రైతులతో కలిసి నీట మునిగిన వరి పంట పొలాలను నందిగామ మండల టిడిపి అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వీరాస్వామిన్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని, ముఖ్యంగా చేతికి వచ్చిన వరిపంట పూర్తిగా పడిపోయి, పంట పొలాల్లో నీరు నిలిచిపోయిందని పంట పూర్తిగా నష్టపోయిందని వీరాస్వామి ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే అధికారులు స్పందించి పంట పొలాలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ గ్రామ పార్టీ నాయకులు, రైతు రామిరెడ్డి సుబ్బారావు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ రామిరెడ్డి శ్రీనివాసరావు, మండదపు వెంకట్రావు, మాదల సురేష్, రైతులు రామిరెడ్డి శ్రీనివాసరావు, (మామిడి ఆకులు), చలమల గురునాదం, తాడాపనేని చంద్రం, వీరంకి సీతారామయ్య, జరబన నరేంద్ర, కూరకుల గంగరాజు, రామిరెడ్డి నరసింహారావు, కోలగట్ల నరసింహారావు, పెరన్న వెంకట్రావు, తదితర రైతులు పాల్గొన్నారు. తుపాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ తహశీల్దార్ నరసింహారావు పేర్కొన్నారు. పశువులను పొలాల్లో వదలకూడదని లోతట్టు ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మండలంలో నదీతీర ప్రాంతాలలో రెవిన్యూ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసి, సహాయార్థం ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. సహాయం కోసం 98499 03994 నెంబరును సంప్రదించాలని సూచించారు. వరి కోతలు ముమ్మరంగా సాగటంతో పనలు తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. యకరానికి ముప్పై వేల రూపాయిల వరకు మాగాణి రైతులు నష్టపోయారు. కంచల గ్రామంలో కోతకు వచ్చిన వరి పంట పూర్తిగా నీట మునగటంతో కంచల గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారు. నందిగామ మండలంలో సుమారు పదివేల ఎకరాల్లో మాగాణి సాగైంది. నందిగామ, అనాసాగరం, మాగల్లు, సోమవరం, రుద్ర వరం తదితర ప్రాంతాల్లో మాగాణి పంటలకు అపార నష్టం కలిగింది. నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సిసిఐ కేంద్రం వద్ద పత్తి పూర్తిగా తడిసి పోయింది. పొలాల్లో పత్తి కాయలు పగిలి తెల్లగా వచ్చిన పత్తి వర్షాలకు పూర్తిగా తడిసి నలుపు రంగు వేయటంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న, అపరాల పంటలకు అపార నష్టం కలగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటలను పరిశీలించిన సిపిఎం నాయకులు

మైలవరం : మండలంలోని సబ్జుపాడు, చంద్రగూడెం గ్రామాల్లో నేలకొరిగిన వరి, పత్తి పంటలను, మిరప తోటలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఎంత పెట్టుబడి పెట్టారో ఎంత నష్టం వాటిల్లుతుందో రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ తుపాన్ ప్రభావానికి చేతికొచ్చిన పంటలు నేలమట్టమయ్యాయని వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని, పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలు నీట మునగటంతో వరి కంకులు మరలా మొలకెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తడిసిన మొలకెత్తిన ప్రతి ధాన్యపు గింజను, రంగుమారిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

విస్సన్నపేట: మిచాంగ్ తుపాను ప్రభావంతో నిన్న రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తిరువూరు నియోజకవర్గంలో పంటలు నీట మునిగాయి. ఈదురు గాలులతో వరిచేలు నేలకొరిగాయి. ఎడతెరిపి లేని వర్షంతో పంటను కాపాడుకోలేకపోతున్నామని మండలంలోని రైతులు ఆందోణన చెందుతున్నారు.

రోడ్లు జలమయం

రెడ్డిగూడెం : మిచాంగ్ తుఫాను ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ నివాస గహాల ఆవరణల్లోకి వస్తున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను వాడుకుంటుందనీ అందువలన గ్రామ పంచాయతీ పాలకవర్గం అప్పులు పాలై నిస్సహాయ స్థితిలో ఉన్నామని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. కొన్ని ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని చోట్ల గతంలో వేసిన సిమెంటు రోడ్లు తప్ప ఇప్పుడు పట్టించుకున్న వారే లేరు. గతంలో గ్రామ పంచాయతీలు కనీసం గ్రావెల్‌తో నైనా రోడ్లను వేసేవారు కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో వర్షం పడితే మురుగునీరు రహదారులపైకి వచ్చి చేరడంతో రహదారులు అధ్వానంగా తయారయ్యి రాకపోకలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

తడిసిన పొలాలను పరిశీలించిన ఎఒ : ముచ్చినపల్లి, కునపరాజుపర్వ గ్రామాలు వరి పొలాలును మండల వ్యవసాయ అధికారి రెంటపల్లి సురేష్ పరిశీలించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో గింజలు తడిచి మొలకెత్తే అవకాశం వుందని, మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పత్తి, మిరప చేలలో వర్షపు నీరు నిలవకుండా, వర్షపు నీరు వేగంగా బయటికి పోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిధిలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. తుపాను దష్ట్యా, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయమని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, వర్షం తగ్గాక అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, దివ్య పాల్గొన్నారు.

తిరువూరు : తడిసి ముద్దయిన ధాన్యాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టిడిపి తిరువూరు నియోజవర్గ ఇన్‌ఛార్జ్ శవాల దేవదత్తు కోరారు. ఎ.కొండూరు మండలం, కంభంపాడు శివారు అట్లప్రగడలో వర్షాభావం వల్ల దెబ్బతిన్న వరి పంటలను ఆయన మంగళవారం గ్రామ రైతులతో కలిసి పరిశీలించారు. తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో అష్టకష్టాలు పడి పండించిన వరి పంటను నోటిదాకా వచ్చేసరికి తుఫాన్ తమకు నష్టాన్ని కలగజేసిందని రైతులు ఆయన ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడుతుందని ముందుగానే పంటను కోసి, నష్టం కలగకుండా చూసుకుందాం ఆనుకుంటే, వరి కోత మిషన్ డిమాండ్ వలన, కోత మెషిన్లు అందుబాటులో లేకపోవడం వల్ల, తీవ్ర నష్టానికి గురయ్యానని రైతు వేణుగోపాల్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో, ప్రభుత్వాలు ఆదుకోకపోతే రైతు మనుగడే కష్టంగా ఉంటుందని, నష్ట పరిహారం వరి పంటకు ఏకరానికి రూ.60 వేలు ఇవ్వాలని, అందుకు సమగ్రంగా పంట నష్టం అంచనా వేసి రైతుల ఆదుకోవాలని దేవదత్తు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వత్సవాయి : పత్తి, వరి, వేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పత్తి తీసే సమయంలో ఈ వర్షం వల్ల నలుపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, గింజలు కూడా మొలకెత్తుతాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఒక ఎకరానికి పది క్వింటాలు పత్తి వచ్చే తరుణంలో రైతులకు 60 నుంచి 70వేల వరకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వరి కూడా కోత సమయంలో ఉండటంతో వర్షం ధాటికి మొత్తం నేలమట్టమైందని కన్నీరుమున్నీరవుతున్నారు. మిర్చి తోటలు నేలకొరిగాయి. పొలాల్లో నీళ్ల నిలిచిపోయాయి. మిరపకాయ సైతం నలుపయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

పెనుగంచిప్రోలు : మిర్చి, వరి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో మిర్చి సాగు చేస్తున్న రైతులు మిర్చి పంట మొదటి కోతలు మొదలు పెట్టే సమయానికి తుఫాన్ ముంచెత్తింది. మునేటి ఆయకట్టు కింద వరి పంటలు ఇప్పటికే కోతలకు వచ్చాయి. కొంతమంది రైతులకు ఖాళీ దొరక్క, వరి కోత యంత్రాలు అందుబాటులో లేక ఆలస్యమవడంతో ఈదురుగాలులు, తుపాను పంటలను నేలమట్టం చేశాయి. తహశీల్దార్ లక్ష్మి కళ్యాణి, ఎఒ రామ సుబ్బారెడ్డి వరి పంటలను పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని తడిసిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తుఫాను కారణంగా నష్ట పోయిన రైతులను సత్వరమే ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.


గంపలగూడెంలో కట్టలేరు వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


నందిగామలో కూలిన ప్రహరీ, పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం


పెనుగంచిప్రోలులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు


రెడ్డిగూడెంలో రోడ్లపైనే వర్షపు నీరు


నందిగామలో నీట మునిగిన వరి పంట


బంటుమిల్లిలో రైతు సంఘం నాయకుల పరిశీలన


చల్లపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పర్యటన


పెదపారుపూడిలో తడిసిన వరిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

పంట పొలాలు, పునరావాస కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గూడూరు: తుమ్మలపాలెం గ్రామంలో భారీ వర్షాలతో నీట మునిగిన పంట పొలాలను మంత్రి జోగి రమేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ నీట మునిగిన పంట పొలాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంగా మధుసూదనరావు, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ తలుపులు వెంకటకృష్ణారావు, వ్యవసాయ శాఖ మండల అధికారి జివి శివప్రసాద్ పాల్గొన్నారు. **మోపిదేవి:** తుఫాను కారణంగా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను వైసిపి నాయకులు పరిశీలించారు. బాధితులకు అందుతున్న సౌకర్యాలపై మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) నేతత్వంలో సందర్శించారు. అధికారులతో కలిసి శిబిరంలోని వారికి భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గోవిందు మాట్లాడుతూ మండలంలో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 60 మందికి పైగా బాధితులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండలంలోని పెందూరు, సాతులూరు, ములపర్రు, అర్ధమూరు, ఆముదాలపల్లి, చోరంపూడి, మల్లంపూడి, నాగేశ్వరావుపేట, జానకిరాంపురంలో వరి పొలాలను ఎపి రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, సిఐటియు నాయకులు మాజీటి శ్రీనివాసరావు, రైతుసంఘం మండల కార్యదర్శి


గూడూరులో పర్యటిస్తున్న మంత్రి జోగి రమేష్

లంకదాసుల అజయ్‌ఘోష్ పరిశీలిచారు. ముందుగా యానాదులను బంటుమిల్లి హైస్కూల్లో శిబిరాలకు తరలించాలని ఎమ్మార్వో మొరల సత్యనారాయణకి తెలియజేయగా వారందరిని శిబిరాలకు తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. **చల్లపల్లి:** వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల బృందం మండలంలోని చల్లపల్లి, నిమ్మగడ్డ, వెలువోలు, యార్లగడ్డ, నాదెళ్లవారిపాలెం గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. గ్రామాలలో రైతులను కలిసి మాట్లాడారు. పంట నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధన సడలించి తడిసి మొలకెత్తిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మాతంగి లక్ష్మయ్య, తలారి నాగేశ్వరరావు పాల్గొన్నారు. **పెదపారుపూడి:** మండల కేంద్రమైన పెదపారుపూడిలో నీట మునిగిన పొలాలను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరిశీలించారు. తుపాను ప్రభావంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డిఓ పద్మావతి, తహశీల్దార్ వి.నాగభూషణం, ఎంపిపి గోగం సురేష్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు:** మండల కేంద్రమైన కోడూరులో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశామని, 600 మందికి పైగా సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పరిసే మాధవరావు, ముద్దినేని చందర్రావు పాల్గొన్నారు. స్వతంత్రపురం గ్రామంలో మండల అధికారులు ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంలో ఏర్పాట్ల గురించి, భోజనం వసతి గురించి రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, పొలవత్తిన మోహన్ రావు, రేపల్లె ప్రకాష్ పరిశీలించారు. అతనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సముద్ర తీర ప్రాంత గ్రామాలైన ఇరాలి, ఉటగుండం, బసవానిపాలెం, రామకృష్ణాపురంలో పర్యటించారు. **మచిలీపట్నం రూరల్:** తుపాను ప్రభావిత ప్రాంతాలైన పాతేరు, పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోనగుండుపాలెం గ్రామాల్లో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు లంకే నారాయణ ప్రసాద్, వక్కపట్ల శ్రీను, సర్పంచ్ మోకా రాజు, లంకే హరికృష్ణ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని పెంజెంద్ర గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను గుడివాడ టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అంగలూరు, చంద్రాల, విన్నకోట, కవుతరం గ్రామాల్లో రెండో పంటగా మినుము విత్తనాలు చల్లగా వర్షానికి దెబ్బతిన్నాయన్నారు.

లారీలను దాబాల వద్ద నిలపాలి : సిఐ

ప్రజాశక్తి-గన్నవరం

తుపాన్ కారణంగా జాతీయ రహదారిపై సూళ్లూరుపేట వద్ద నీళ్లు ప్రవహించి ట్రాఫిక్ జామ్ ఏర్పడినందున చెన్నై వైపు వెళ్లే లారీలకు దాబా హోటల్ వద్ద నిలుపుదల చేసుకోవాలని గన్నవరం సిఐ పి.కనకారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైవే పెట్రోలింగ్ వాహనాలను అప్రమత్తం చేశామన్నారు. లారీ అసోసియేషన్ కార్యాలయాలను స్థానిక అధికారులు సంప్రదించి పరిస్థితి మెరుగుపడే వరకు లారీలు పార్కింగ్ వద్ద ఉండేలా చూడాలన్నారు. పరిస్థితిని ఎస్ఐ నవీన్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం

తుపాను కారణంగా గన్నవరం నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టివి లక్ష్మణస్వామి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వరికి రూ.30 వేలు, అరటి రూ.40 వేలు, పత్తి రూ.25 వేలు, మామిడి రైతులకు రూ.40 వేలు చొప్పున పరిహారం అందించాలని కోరారు. రెండో పంటగా వేసిన అపరాలు పూర్తిగా దెబ్బతిందని, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా మినుములు, పెసర విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చేనేత కార్మికులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-చల్లపల్లి: చేనేత కార్మికులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చల్లపల్లి, పడమట వైపు వీవర్స్ కాలనీ, యార్లగడ్డ వీవర్స్ కాలనీల్లో మంగళవారం సిపిఎం బృందం పర్యటించి మగ్గాలను పరిశీలించింది. మధు కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తుపాను కారణంగా ఉపాధి కోల్పోయామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గాల గుంటల్లోకి నీళ్లు చేరడంతో మగ్గం నేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మధు మాట్లాడుతూ చేనేత కార్మికుల కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం, నిత్యవసర వస్తువులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నూలు ఉచితంగా సరఫరా


చేనేత కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, కార్మికులు కాగిత బసవరాజు, అందే శ్రీనివాసరావు, కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు, మునగాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజల పరిస్థితి ప్రశ్నార్థకం : మండలి


వరి పంటలను పరిశీలిస్తున్న మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-కోడూరు: సముద్ర తీర ప్రాంత గ్రామ ప్రజల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని తక్షణమే సముద్రపు కరకట్టను ప్రతిష్ట పరచాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు మండల శివారు పాలకాయతిప్ప వద్ద కరకట్టను, అవుట్ ఫాల్స్ స్లూయిస్‌లను టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రాం, జనసేన పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కరకట్టపై నివసించే యానాది కుటుంబీకుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తుపాన్ వంటి విపత్కర పరిస్థితుల్లో తీర ప్రాంత గ్రామాలకు పరిరక్షణగా ఉన్న సముద్రపు కరకట్ట పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. అవుట్ పాల్స్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడైనందున ఉప్పునీరు నేరుగా పంట పొలాల మీదకు చేరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు రహదారులు కూడా అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సముద్ర కరకట్టను ప్రతిష్టపరిచాలని, నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవడంలో విఫలం : వర్ల

ప్రజాశక్తి-పెదపారుపూడి: మండలంలో తుపాను ప్రభావంతో కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పామర్రు నియోజకవర్గ వర్గ టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం ఎలమర్రు, ఈదుల మద్దాలి, చినపారుపూడి గ్రామాలలో వరి పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి 25 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి), మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, కనుమూరి ఈశ్వర్ పాల్గొన్నారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం గ్రామంలో గల పునరావాస కేంద్రంలో ఉన్న తుపాను బాధితులను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ మంగళవారం పరామర్శించారు. బాధితులకు పండ్లు, బిస్కెట్లు కోడూరు మండలం తాసిల్దార్ లతీఫ్ పాషా, పంచాయతీ కార్యదర్శి యలవర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్రే గంగయ్య, కోట రాంబాబు, దామెర్ల నారాయణ, తోట దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి జైలు


ప్రజాశక్తి-గన్నవరం: గొల్లనపల్లి గ్రామంలో వైన్ షాపు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆనందరావుపై అదే గ్రామానికి చెందిన రాకేష్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో మంగళవారం గన్నవరం కోర్టు అతనికి ఏడాదిన్నర పాటు జైలు శిక్ష విధించింది. కరోనా సమయంలో వైన్ షాప్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఆనందరావు, వేరొక కానిస్టేబుల్ రమేష్‌పై మాస్క్ ధరించకుండా వచ్చిన రాకేష్‌ను నియంత్రించారు. కోపంతో రెచ్చిపోయిన రాకేష్ వారిపై కత్తితో దాడి చేశాడు. ఆనందరావు చేతికి గాయాలయ్యాయి. ఈ కేసులో నిందితునికి ఏడాదిన్నర కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పునరావాస కేంద్రాలకు బాధితులు

ప్రజాశక్తి-చల్లపల్లి: తుపాను నేపథ్యంలో చల్లపల్లిలోని రెండు మురికివాడలో జీవిస్తున్న నిరుపేదలను పునరావాస కేంద్రానికి తరలించారు. అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కోమలానగర్, నారాయణరావు నగర్ ప్రాంతాల్లోని మురికివాడల్లో జీవిస్తున్న 70 కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. తహసిల్దార్ కే.గోపాలకృష్ణ, ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

రాముకు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ: టిడిపి గుడివాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందని వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడికి, యువజన నాయకులు నారా లోకేష్‌కి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెంనాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. తనను అనునిత్యం ప్రోత్సహించిన పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్రలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీని ముందుండి నడిపించిన రావి వెంకటేశ్వరరావు అడుగుజాడల్లో నడుస్తానన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులైన వెనిగండ్ల రాముకి టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివాజీ, రాంబాబు, టిఎన్ఎస్ఎఫ్ కమిటీ సభ్యులు గూడూరు సురేంద్ర, నారగాని వంశీ, పాపారావు, భాను, సాగర్, ఇషాక్, క్రాంతి, నితీష్, మహేష్, ప్రేమ్, సుమంత్, రిజ్వాన్, అనంత్ తదిరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
బుధవారం
6 డిసెంబర్ 2023


కంచికచర్లలో పత్తి పొలంలోకి చేరిన నీరు


మైలవరంలో తడిసిన పత్తి


గుడ్లవల్లేరులో...


గన్నవరంలో...


మచిలీపట్నం కల్యాణనగర్‌లో...

నేలకూలిన ఇళ్లు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్: వర్షాల కారణంగా మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ శారదానగర్ శివారు కల్యాణనగర్‌లో ఓ రేకుల షెడ్డు నేల కూలిపోయింది. కొడాలి శ్రీధర్‌కు చెందిన ఇంటి గోడలు వర్షపు నీటికి నానిపోయింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. **మోపిదేవి:** తుపాన్ కారణంగా మండలంలోని పెదప్రోలు గ్రామంలోని చైతన్యనగర్‌కు చెందిన కైలా కుమారి, కైలా అనసూయలకు చెందిన రెడు పూరిల్లు కూలిపోయాయి. సమాచారం తెలుసుకున్న తాసిల్దార్ కె.నవీన్‌కుమార్ వారిని సహాయ శిబిరానికి తరలించారు.

ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

• తుపాను ప్రభావం తగ్గిన వెంటనే ఎన్యుమరేషన్ • కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మిచౌంగ్ తుపాన్ కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా అన్ని విధాలుగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి మాట్లాడుతూ తుపాను ప్రభావిత మండలాలైన నాగాయలంక, కృత్తివెన్ను, కోడూరు, చల్లపల్లి, మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మోపిదేవి మండలాలపై ప్రత్యేక దష్టి సారించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు ఆయా మండలాల్లో 67 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 3,305 మందిని తరలించామన్నారు. నాగాయలంక మండల పరిధిలోని 16 పునరావాస కేంద్రాల్లో 758 మంది, కోడూరు మండల పరిధిలో 6 పునరావాస కేంద్రాలలో 697 మంది, మచిలీపట్నం పరిధిలో 25 కేంద్రాలలో 1472 మంది, కృత్తివెన్ను పరిధిలో 5 కేంద్రాలలో 83 మంది, అవనిగడ్డ పరిధిలో 4 కేంద్రాలలో 74 మంది, మోపిదేవి పరిధిలో 3 కేంద్రాలలో 12 మంది, బంటుమిల్లి పరిధిలో 4 కేంద్రాలలో 132 మంది, చల్లపల్లి మండల పరిధిలో 4 కేంద్రాలలో 77 మంది ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ల వద్ద షిఫ్టుల పద్ధతిలో 24 గంటలూ పని చేసే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు చొప్పున, రూ.2,500ల చొప్పున పునరావాస కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో బాధితులకు అందించనున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే పంట నష్టంపై ఎన్యుమరేషన్ చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కలెక్టరేట్‌తో సహా అన్ని ఆర్డీవోలు, తహసిల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ విభాగాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకున్నామని, కలెక్టరేట్లో 08672 252572, 252000 నెంబర్‌లో తుపాను సమాచారం గానీ సహాయక చర్యల కోసం గానీ సంప్రదించవచ్చని చెప్పారు.


రాడార్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న రాజాబాబు, లక్ష్మీశా

పునరావాస కేంద్రాల్లో ఇబ్బందుల్లేకుండా చర్యలు

తుపాను నేపథ్యంలో ప్రభుత్వం కృష్ణాజిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించిన రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శ్రీ లక్ష్మీశా మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో సమావేశమయ్యారు. జిల్లాలో తుపాను ప్రభావిత తీర ప్రాంత ఏడు మండలాల పరిధిలో 67 సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తున్నట్లు చెప్పారు. సహాయ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మంచినీటి వసతితో పాటు బాధితులకు టాయిలెట్ వంటి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రత్యేక అధికారికి వివరించారు.

రాడార్ కేంద్రంలో తుపాను గమనం పరిశీలన

తుబీవను నేపథ్యంలో లక్ష్మీశా, రాజాబాబు మంగళవారం స్థానిక రాడార్ కేంద్రం సందర్శించి ప్రస్తుతం తుపాను గమనాన్ని పరిశీలించారు. తుపాను వేగం, వర్షపాతం అంచనా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాడార్ కేంద్రం డైరెక్టర్ ఎస్. ప్రయాక్ మిచౌంగ్ తుపాను ప్రస్తుత పరిస్థితిని వివరించారు.

గుడివాడలో నేలకొరిగిన చెట్లు

ప్రజాశక్తి-గుడివాడ: తుఫాన్ ప్రభావంతో గుడివాడ పట్టణంలో పెద్ద చెట్లు మంగళవారం నేలకొరిగాయి. గుడివాడ పట్టణంలోని పోస్టాఫీసు రోడ్డులోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయాల ముందు ఉన్న పెద్ద చెట్లు నేలకొరిగాయి. చెట్లు రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో గుడివాడ అగ్నిమాపక శాఖ సిబ్బంది ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చెట్లను తొలగించారు.


చెట్లను తొలగిస్తున్న సిబ్బంది


ఘంటసాలలో...

తుపాన్ బీభత్సం



రైతు వెన్ను విరిచిన 'మిచౌంగ్'

వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు

ఈదురుగాలులకు నేలకొరిగిన వరి

పత్తి పొలాలను ముంచెత్తిన వర్షం

తడిసిన మొక్కజొన్న దెబ్బతిన్న బొప్పాయి, జామ, అరటి

'మిచౌంగ్'తో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని రైతులు దిక్కులేని స్థితిలో ఉన్నారు. తపాను ప్రభావం రైతుల వెన్ను విరిచింది. వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న పంటలు నీటమునిగాయి. వరి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతల ఆశలు నీరుగారాయి. ఆరుగాలం కష్టపడి పండించి పంట చేతికొచ్చే సమయానికి తుపాను విరుచుకుపడటంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆపత్కాలంలో ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ ఏడాది రైతులకు సాగు కలిసి రాలేదు. మొన్నటి వరకు వర్షాభావంతో అల్లాడిన రైతులు పంటలను ఎలాగోలా కష్టపడి ఒడ్డుకు చేర్చారు. తీరా పంటలు చేతికొచ్చే సమయంలో తుపాను రూపంలో దురదృష్టం వెంటాడింది. తుపాను ప్రభావంతో వేల ఎకరాల్లో నీట మునిగింది. ఈదురుగాలులతో కూడిన వర్షాల వల్ల కోతకు వచ్చిన వరి నేలకొరిగింది.

ప్రజాశక్తి-గన్నవరం: తుపాను కారణంగా రైతులు నిండా మునిగిపోయారు. గన్నవరం మండలంలో రూ.3 కోట్ల దాకా పంట నష్టం జరుగుతుందని రైతులు తెలిపారు. సాగు చేసిన వరిలో 20 శాతం కోతలు పూర్తి కాగా 10 శాతం నూర్పిళ్లు జరిగాయి. కోత కోసిన ధాన్యంలో 20 శాతం కూడా తరలించలేదు. చాలా వరకు పొలాల్లో, రహదారులపైనే ఉంది. కేసరపల్లి, దావాజీగూడెం, బుద్ధవరం, అల్లాపురం, సావర గూడెం, జక్కుల నెక్కలం, ముస్తాబాద్, సూరంపల్లి గ్రామాల్లో వరి పైరు నేలవాలాయి. రోడ్లమీద పోసిన ధాన్యం రాశులకు టార్పాలిన్లు కప్పినా నీరు చేరి ధాన్యం తడిసిపోయింది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో పది వేల ఎకరాలు పైగా పంట దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలోని పది గ్రామాల్లో పొగాకు, మిర్చి, మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న తడిసింది. వారం కిందట క్వింటా రూ.2200 నుంచి రూ.2300 ధర పలికింది. తడవడంతో రూ.2 వేలకు పడిపోయింది. గాలుల ధాటికి జామ, బొప్పాయి దెబ్బతిన్నాయి. చనుపల్లి వారి గూడెం, గొల్లనపల్లిలో పూలతోటల్లోకి నీరు చేరింది. వాన, గాలుల తీవ్రత పెరిగితే మిరప పైరు దెబ్బతినే అవకాశం ఉంది. **గుడ్లవల్లేరు:** మండలంలోని 20 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెన్నేరు ప్రభాకర్‌రావు తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి కోత కోసిన పొలాల్లో పనలు నీట మునిగాయి. కోతకొయ్యని వరి పంట పొలాలు నేలకొరిగి నీట మునగటంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. **ఉయ్యూరు:** రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి రైతులతో పాటు ఉద్యానవన పంటల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి కోతకోసి పొలాల్లో పనలపై ఉన్న తరుణంలో వర్షానికి పొలాల్లో నీరు నిలిచి పనలు తేలియాడుతున్నాయి. మండల పరిధిలో 12,868 ఎకరాల్లో వరిసాగు చేయగా అందులో 2,468 ఎకరాల్లో పనలపై ఉండగా 2,231 ఎకరాల్లో కుప్పలు వేయగా 2,176 ఎకరాల్లో కోతకోయని వరి పంట వర్షాలకు నేలవాలింది. పెదఓగిరాల పరిసర గ్రామాల్లో అరటి, పసుపు, కూరగాయల పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. **కంచికచర్ల:** కంచికచర్లలో ఉదయం 32.2 మిల్లీమీటర్ల, సాయంత్రానికి 12.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలంలో మెట్ట, మాగాణి పంటలకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది నదీతీర గ్రామాలు, నీటి వసతి ఉన్నచోట సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈదురుగాలులు, వర్షానికి వరి పంట నేలకొరిగింది. పత్తి పంట 7,500 ఎకరాల్లో సాగవ్వగా వర్షం నీరు పత్తి చేలను ముంచెత్తింది. **ఘంటసాల:** రైతులు ఆందోళన చేయటంతో వేములపల్లి బస్టాప్ వెనుక డ్రైనేజీపై అక్రమంగా ఏర్పాటు చేసిన తూములను తొలగించారు. మురుగునీరు పోక పంట పొలాలు ముంపుకు గురికావటం గుర్తించిన అధికారులు వెంటనే జేసీబీ సాయంతో తూములను తొలగించి నీటి పారుదలకు చర్యలు చేపట్టారు.

సంగమేశ్వరం వద్ద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ: తుపాను కారణంగా నాగాయలంక మండలం సంగమేశ్వరంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరిశీలించారు. అనంతరం నాగాయలంక మండలం పాత ఉపకారి గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వీర వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యాసంస్థలకు సెలవు : డిఇఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా): తుపాను తీవ్రత, వర్షాలు కొనసాగుతున్న దృష్ట్యా కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశానుసారం కృష్ణాజిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు బుధవారం ఆరో తేదీ కూడా సెలవు ప్రకటించినట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు.

నష్టంపై మీనమేషాలు వద్దు : కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. తుపాను నష్టం అంచనాపై మీనమేషాలు లెక్కించకుండా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ముందు నుంచి వేగవంతం చేసి ఉంటే రైతాంగానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ: మిచౌంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గుడివాడ సుందరయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేతికొచ్చిన పంటను మిల్లర్లు సకాలంలో కొనకపోవడం వల్ల వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. నష్టపోయిన రైతులందర్నీ గుర్తించి నష్టాన్ని అంచనా వేసి వాళ్లకు తగిన ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

దివిసీమ అతలాకుతలం

ప్రజాశక్తి-అవనిగడ్డ: తుపాను ప్రభావంతో గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు దివిసీమ అతలాకుతలమైంది. నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లో వేలాది ఎకరాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. అవనిగడ్డ, నాగాయలంకలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. గృహాల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. దీంతో వర్షపు నీటిని తరలించేందుకు పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అవనిగడ్డలోని ప్రధాన రహదారులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. తుపాను కారణంగా అవనిగడ్డ, నాగాయలంకలో 15 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ఎం.మరియాదేవి, తాసిల్దార్ ఎల్‌వివిఎస్ రామకృష్ణ పునరావాస కేంద్రాలలో బాధితులకు కావలసిన అన్ని ఏర్పాట్లను చూస్తున్నారు. ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ రాములునాయక్ పర్యవేక్షణలో బాధితులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు నాగాయలంక మండలంలో ప్రత్యేక అధికారిగా డీఎల్పిఒ విజయలక్ష్మి బాధితులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. కృష్ణానది గర్భంలోని గ్రామాలకు చెందిన ప్రజలు పునరావాస శిబిరాలకు తరలివచ్చేందుకు ఆసక్తి కనబరచలేదు. భారీ వర్షాలకు మండల పరిధిలోని పాత ఎడ్లలంకకు కృష్ణానదిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి తెగిపోవడంతో అవనిగడ్డకు చెందిన ప్రజాప్రతినిధులు రహదారిని పునర్నిర్మించారు జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు గ్రామస్తులతో కలసి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా రహదారికి ఏర్పడ్డ గండిని పూడ్చి వేయించారు


పునరావాస కేంద్రం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు


అవనిగడ్డలో నిలిచిన వర్షం నీరు


ఉయ్యూరులో...

పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుడివాడ : మున్సిపల్ కార్యాలయ పరిధిలోని పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆదేశించారు. గుడివాడ మున్సిపల్ కార్యాలయం పరిధిలోని 19, 20, 23 సచివాలయ వార్డులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది చూడాలన్నారు.

ఐసిఇయు ఆధ్వర్యంలో ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం ఆధ్వర్యంలో స్థానిక బైపాస్ రోడ్లోని ప్రజలకు మంగళవారం ఆహార పొట్లాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు, ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్, జె.సుధాకర్, టి.చంద్రపాల్, ఎల్.రాజశేఖర్, వై.స్వామినాథ్, యు.రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆర్‌బికె పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు: తుపాను వల్ల ధాన్యం తడిసి రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని సివిల్ సప్లైస్ కమిషనర్ ఆరుణకుమార్ తెలిపారు. గండిగుంట రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొల్లపూడి వేణుబాబు, ఎఎంసి చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు కమిషనరు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా సివిల్ సప్లైస్ ఇన్చార్జ్ డి.రాజు, ఉయ్యూరు తహ సిల్దార్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి: యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: తుపాన్ నష్టం అపారంగా ఉందని, ఆపద సమయంలో ప్రభుత్వం రైతులకు ప్రజలకు అండగా నిలవాలని కోరారు. తుపాన్ తీవ్రతపై వారం నుంచే కేంద్ర విపత్తు సంస్థలు హెచ్చరికలు జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం కనీసం సమీక్షించకపోవడం దారుణమన్నారు. తుపాన్ సహాయక చర్యల్లో టిడిపి శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల: కౌలు రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కొల్లి వెంకటరామిరెడ్డి కోరారు. మంగళవారం అయినపూరు, హనుమంతపురం, పమిడిముక్కల, మేడూరు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని కోరారు.

పంట నష్టం అంచనా

ప్రజాశక్తి-ఉయ్యూరు: తుపానుకు నష్టపోయిన వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.పద్మావతి మంగళవారం పరిశీలించారు. కడవకొల్లు, వీరవల్లి గ్రామాల పరిధిలో నేలవాలిన వరి పంట, నీటిలో నానుతున్న వరి పనలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ గన్నవరం ఎం.సునీల్, మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యాన పంటలను జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి పరిశీలించారు. పెదఓగిరాలలో నేల వాలిన అరటి, ఇతర వాణిజ్య పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి ఎ.నాగదేవిశ్రీ, కంకిపాడు అధికారి చందుజోసఫ్ సుందరం, ఉద్యాన విస్తరణ అధికారి జి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 5051 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

మొచింగ్ తుఫాను ప్రభావం వల్ల ఎన్టీఆర్ జిల్లాలో పంట నష్టంపై జిల్లా యంత్రాంగం ఒక అంచనాకు వచ్చింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా దాదాపు 169 గ్రామాలు పంటలు దెబ్బతిన్నట్లుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సుమారు 4876 హెక్టార్లలో వరి, 98హెక్టార్లలో శనగ, 6 హెక్టార్లలో పెసర, 16 హెక్టార్లలో కంది, 15 హెక్టార్లలో మొక్క జొన్న, 30 హెక్టార్లలో జొన్న, 10 హెక్టార్లలో మినుము తదితర పంటలు నీట మునిగాయి. విజయవాడ రూరల్ మండలంలో 16 గ్రామాల్లో 1450 హెక్టార్లలో, విజయవాడ అర్బన్‌లో 740 హెక్టార్లలో వరి దెబ్బతినింది. వీరులపాడు మండలంలో 53 హెక్టార్లలో వరి, 13 హెక్టార్లలో శనగ, 6 హెక్టార్లలో పెసర, 16 హెక్టార్లలో కంది, 5 హెక్టార్లలో మినుము దెబ్బతిన్నాయి. కంచికచర్ల మండలంలో 450 హెక్టార్లలో వరి, 85 హెక్టార్లలో శనగ, 15 హెక్టార్లలో మొక్కజొన్న, 30 హెక్టార్లలో జొన్న దెబ్బతిన్నాయి. నందిగామ మండలంలో 510 హెక్టార్లలో, వత్సవాయి మండలంలో 40 హెక్టార్లలో, జగ్గయ్యపేట మండలంలో 120 హెక్టార్లలో, పెనుగంచిప్రోలు మండలంలో 50 హెక్టార్లలో, ఏకొండూరు మండలంలో 30 హెక్టార్లలో, తిరువూరు మండలంలో 30 హెక్టార్లలో, విస్సన్నపేట మండలం 58 హెక్టార్ల, రెడ్డిగూడెం మండలంలో 70 హెక్టార్లలో, మైలవరం మండలంలో 205 హెక్టార్ల, ఇబ్రహీంపట్నం మండలంలో 550 హెక్టార్లలో, జి.కొండూరు మండలంలో 480 హెక్టార్ల వరి పంట నీటి మునిగింది. జి.కొండూరు మండలంలో మరో 5 హెక్టార్ల కంది దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

రహదారులు జలమయం

మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో విజయవాడ నగరం జలమయమైంది. ఆర్‌టిసి బస్టాండ్, తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు భారీ ఎత్తున నీరు వచ్చి చేరింది. అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులైన ఏలూరు, బందరు రోడ్లు కాల్వలను తలపించాయి. నిర్మలా కాన్వెంట్, మొగల్రాజపురం, బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పంటకాల్వ రోడ్డు, చుట్టుగుంట, కృష్ణలంక, భవానీపురం, మాచవరం, బీసెంట్ రోడ్డు తదిరత ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు నీళ్లు నిండిపోయాయి. దీంతో వాహనాదారులు, పాదాచారులు అనేక ఇబ్బందులు పడ్డారు. రామలింగేశ్వర్ నగర్, పూర్ణచంద్రనగర్, మధర్ థెరిస్సా జంక్షన్ వంటి పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ నుంచి అంతర్గత రోడ్లలో మురుగు నీరు ప్రవాహంలా మారింది. బెంజి సర్కిల్ ఫ్లైఓవర్‌లకు ఇరువైపుల సర్వీసు రోడ్లు గుంతలమయం అయ్యాయి. వర్షపు నీరు గుంతల్లో నిండిపోతుండటం వల్ల ఏది రోడ్డు, ఏది గుంతో తెలియక వాహనదార్లు నానా తంటాలు పడుతున్నారు.

కుండపోత

మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం క్రమంగా పెరిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా సగటున 36 మిమీ, మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు 13.13 మిమీ, సాయంత్రం 4గంటలకు 10.72మిమీ కురవగా, సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు 18.08 మిమీ కుండపోత వర్షం కురిసింది. ఈ రెండు గంటల వ్యవధిలో అత్యధికంగా చందర్లపాడులో 30.2 మిమీ, కంచికచర్లలో 29, ఇబ్రహీంపట్నంలో 20.2, విజయవాడ నార్త్‌లో 23.2, విజయవాడ రూరల్‌లో 22.2, విజయవాడ సెంట్రల్‌లో 21.6, విజయవాడ తూర్పులో 20.4 మిమీ చొప్పున వర్షం కురిసింది. జి.కొండూరులో 19.6 మిమీ, రెడ్డిగూడెంలో 19.4, మైలవరంలో 22.6, తిరువూరులో 16.6, వీరులపాడులో 15.8, నందిగామలో 13.6, ఏ.కొండూరులో 11, విస్సన్నపేటలో 10.8, గంపలగూడెంలో 14.0, వత్సవాయిలో 10.2, జగ్గయ్యపేటలో 12.6 మిమీ చొప్పున వర్షం కురిసింది. అతి తక్కువుగా పెనుగంచిప్రోలులో 6.4 మిమీ వర్ష పాతం నమోదైంది.

కృష్ణాజిల్లాలో 157.52 మిమీ వర్షపాతం నమోదు

అత్యధికంగా కృత్తివెన్నులో 169 మిమీ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మిచౌంగ్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. బాపట్ల వద్ద మంగళవారం సాయంత్రం తుపాను తీరం దాటిన తర్వాత ఈదురు గాలులు, వర్షం తీవ్రత పెరిగింది. రాత్రి కూడా కొనసాగుతోంది. తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లావ్యాప్తంగా తీవ్రమైన ఈదురుగాలులు వీచాయి. భారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున ఒక్కో మండలంలో 121.32 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల సమయానికి 36.2 మిమీ చొప్పున మొత్తం 157.52 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కృత్తివెన్ను మండలంలో అత్యధికంగా 169.2 మిమీ వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా మొవ్వ మండలంలో 12 మిల్లీ మీటర్లు నమోదైంది. బంటుమిల్లిలో 114, పెడనలో 64.6, బాపులపాడులో 56.9, గన్నవరంలో 51.2, నందివాడలో 42, గుడ్లవల్లేరులో 38, ఉంగుటూరులో 36, గుడివాడలో 34.8, పెదపారుపూడిలో 31.4, అవనిగడ్డలో 28.6, మోపిదేవిలో 19.8, ఉయ్యూరులో 19.4, మచిలీపట్నంలో 18.8, తోట్లవల్లూరులో 18.8, పామర్రులో 17.8, కోడూరులో 17.6, కంకిపాడులో 17.4, పెనమలూరులో 16, చల్లపల్లిలో 14.6, ఘంటసాలలో 14, నాగాయలంకలో 12.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

విద్యుత్ శాఖకు రూ.34.56 లక్షల నష్టం

ప్రజాశక్తి - విజయవాడ : తుపాను కారణంగా ఉమ్మడి కష్ణాజిల్లా పరిధిలోని 15 మండలాల్లో 111 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు విజయవాడ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు (ఆపరేషన్) ఎ.మురళీమోహన్ తెలిపారు. మచిలీపట్నం, కత్తివెన్ను, బంటుమిల్లి, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, ఉయ్యూరు, తోట్లవల్లూరు, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక పరిధిలోని మొత్తం 49 సబ్‌స్టేషన్లు, 33 కెవి, 11 కెవి, ఎల్టీ లైన్లు తుపాను కారణంగా 111 స్తంభాలు పడిపోయాయని తెలిపారు. 44 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయని, 9.15 కెఎం విద్యుత్ వైర్లు తెగిపడ్డాని తెలిపారు. వీటి పునరుద్ధరణకు 250 మంది సిబ్బంది 19 బందాలుగా ఏర్పడి బుధవారం సాయంత్రం 4 గంటలకల్లా పూర్తిగా ప్రతి గ్రామంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉమ్మడి కష్ణాజిల్లాలో విద్యుత్ శాఖకు రూ.34.56 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఏవైనా లైన్లుగానీ, స్తంభాలుగానీ పడిపోతే వెంటనే స్థానిక విద్యుత్ సిబ్బందికి లేక విద్యుత్ అధికారులకు తెలియచేయాలని, టోల్ ఫ్రీ నెంబర్. 1912కు ఫోన్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

రోడ్లపై వర్షం నీరు లేకుండా చర్యలు : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం కంట్రిక జంక్షన్ నుండి నూజివీడు రోడ్డు వైపు వెళ్లే మేజర్ అవుట్‌ఫాల్ డ్రెన్‌ను పరిశీలించారు. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై, పల్లపు ప్రాంతాల్లో నీరు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవుట్‌ఫాల్ డ్రెన్లలో ఎటువంటి చెత్త పేరు పోకుండా సాఫీగా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఆయన ప్రత్యక్షంగా ఈ పనులను పర్యవేక్షించారు. ఈపర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఇఇలు శ్రీనివాస్, ప్రవీణ్ శర్మ, జోనల్ కమిషనర్ మల్లాద్రి, డిఇ యేసు బాబు పాల్గొన్నారు.



ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు జైలు

(మొదటి పేజీ తరువాయి)

హుస్నాను సైదులు మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె 2016 మే 5న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారించి నిందితుడిని అరెస్టు చేశారు. మే 11న కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుండి కేసు విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో నేరం రుజువుకావడంతో నిందితుడికి జడ్జి ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణు వర్ధన్, ప్రస్తుతం విశాఖపట్నం డిసిపి-1గా ఉన్న కంచి శ్రీనివాస్, ప్రస్తుతంగా అనంతపురం అడిషనల్ ఎస్పిగా ఉన్న గుణ్ణం రామ కష్ణ, సిఎంఎస్ సిఐ, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో 14 మంది సాక్షులను విచారించారు.

IN THE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P. No. 953/2019 IN A.O.P. No. 204/2018

Between :
M/s INDUSIND BANK Ltd.....
DECREE HOLDER
and
1. KAKI SHEELA RAMYA
2. CHAGARLAMUDI SRIKANTH
JUDGEMENT DEBTORS

Judgment Debtor No. 1:
1. Chagarlamudi Srikanth
S/o Venkateswara Rao, Hindu,
Aged About 45 Years,
R/o. # 64-6-10, Old Post Office Road,
Patamata Lanka,
Vijayawada - 520 008. NTR Dist.

Please take notice that in the above D.Hr. filed a E.P. against you, the same was posted for your appearance on 15-12-2023. If, you fail to appear in the above matter before the above said Hon'ble Court at 10-30 A.M. either in person or through your advocate. The E.P. Will be decided in your absence and set-exparte.

(by order of the Hon'ble V Additional Junior Civil Judge at Vijayawada)

PAVAN KUMAR P.
KIRAN KUMAR P.
Advocates
Vijayawada-2
Mobile : 98492 74629

Date of Hearing:
15-12-2023

IN THE COURT OF THE 7th ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
A.S. No.48/2020

Between:
K. Jayadev .... Appellant
AND
A.P. Capital Region Development Authority (CRDA) & 3 Others ... Respondents

To,
R-2: Motha Prathima Priyadarshini, D/o. Late B.V. Prasanna Kumar.
R-3: Perikala Prasanthi, D/o. Late B.V. Prasanna Kumar.
R-4: Bollapalli Sandeep, S/o. Late B.V. Prasanna Kumar, D.No.40-9/4-211, Plot No.103A, Municipal Employees Colony, Opp.Pinnamaneni Policlinic, Patamata, Vijayawada.

పై నెంబరు అపీలులో రెస్పాండెంట్స్ 2 నుండి 4లకు నోటీసులను కోర్టువారి సబ్‌స్టిట్యూట్ సర్వీసు బై పబ్లికేషన్ ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున సదరు రెస్పాండెంట్స్ 2 నుండి 4 వారలు ది.28-12-2023 ఉదయం గం.10.30 ని.లకు శ్రీ కోర్టువారి ముందు ప్రత్యక్షముగానీ లేదా అడ్వకేటు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు లేని యెడల పరోక్షము నందు తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///
వాయిదా తేది: 28-12-2023

టి. బైర్రాజు, అడ్వకేట్
సత్యనారాయణపురం, విజయవాడ-520011

IN THE COURT OF THE 3rd ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.No. 1240/2022

Between:
Muppala Venkata Lakshmi Narayana ... Plaintiff
AND
Chigurupati Srinivas ... Defendant

To,
Chigurupati Srinivas, S/o. Late Radha Krishna, R/o. D.No.12-79, Near TDP Office, Penamaluru Village & Mandal, Krishna Dist.

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీకు మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ది.19-12-2023న ఉదయం గం.10.30 ని.లకు మీరు స్వయముగా గానీ లేదా న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేది:19-12-2023

సుంకర వెంకట సురేష్, జి.అమర్‌నాథ్ రెడ్డి
న్యాయవాదులు, విజయవాడ

మహారాజశ్రీ తిరువూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓఎస్ నెంబర్ 36/2023, మరియు ఐఏ నెంబర్ 13/2023 మరియు 28/2023 మరియు 29/2023

బిట్వీన్:
మెరుగు నాగభూషణం .... వాది
అనుమోలు రాజేంద్రప్రసాద్ మరియు ఒకరు .... ప్రతివాదులు

పై నెంబరు దావాలో మరియు ఐఎలో ఎన్ని పర్యాయాలు మీకు సమన్లు మరియు నోటీసులు పంపినా గానీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై నెంబ రు దావాలోని మరియు ఐఎ లోని మీ హాజరు నిమిత్తం ది.04 -01-2024 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు కాబట్టి మీరు వాయిదా రోజున ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనియెడల మీ పరోక్షముగా విచారణ జరిపి తీర్మానించబడు నని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

మేకల రవి, న్యాయవాది
తిరువూరు, 9491958845

IN THE COURT OF 2nd ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. No.2429/2022

Between:
Yarlagadda Sainadh Chowdary .. Plaintiff
AND
Palavai Nageswara Rao ... Defendant

Defendant:
Palavai Nageswara Rao, S/o. Abraham @ Venkaiah, Hindu, aged about 58 years, D.No.40-10-8A/1, Workmenpet, NTR Circle, Nirmala Convent Road, Patamata, Vijayawada-10.

పై నెంబరు దావాను వాది, ప్రతివాది (పాలవాయి నాగేశ్వరరావు) పై దావా షెడ్యూలు ఆస్తిని ఖాళీ చేయు నిమిత్తం మరియు అద్దెలు మరియు నష్టపరిహారం పే చేయు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.08-01-2024నకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు ప్రతివాది స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపు కొనవలెను. లేనియెడల దావా మీ పై కోర్టు వారిచే పరోక్షమున తీర్మానించబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేది: 08-01-2024

చేకూరి శ్రీపతిరావు, వాదితరుపు న్యాయవాది
సాయినగర్, విజయవాడ.

IN THE COURT OF 2nd ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.No.3/2023 in O.S. No.2429/2022

Between:
Yarlagadda Sainadh Chowdary ... Petitioner/ Plaintiff
AND
Palavai Nageswara Rao ... Respondent / Defendant

Respondent / Defendant:
Palavai Nageswara Rao, S/o. Abraham @ Venkaiah, Hindu, aged about 58 years, D.No.40-10-8A/1, Workmenpet, NTR Circle, Nirmala Convent Road, Patamata, Vijayawada-10.

పై నెంబరు దావాను పిటీషనరు, రెస్పాండెంటు (పాలవాయి నాగేశ్వరరావు) పై దావా షెడ్యూలు ఆస్తిని ఖాళీ చేయు నిమిత్తం మరియు అద్దెలు మరియు నష్టపరిహారం పే చేయు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.08-01-2024నకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు ప్రతివాది స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపు కొనవలెను. లేనియెడల దావా మీ పై కోర్టు వారిచే పరోక్షమున తీర్మానించబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేది: 08-01-2024

చేకూరి శ్రీపతిరావు, పిటీషనరు తరుపు న్యాయవాది
సాయినగర్, విజయవాడ.

KONDAPALLI MUNICIPALITY

KONDAPALLI

Tender Notice No.1488/2023-E1 **Dt.06-12-2023**

e-Procurement Tender Notice

1.	No. of Works	3 No.
2.	Total Value of Works	Rs.9608000
3.	Bid Document Download Starting Date	06-12-2023 at 11:00 AM
4.	Bid Document Download End Date	11-12-2023, at 03:00 PM
5.	Last Date & Time for receipt of bids	11-12-2023 at 03:30 PM
6.	Bid Opening Date	11-12-2023 at 03:31 PM

Further details can be seen @ e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner, KONDAPALLI MUNICIPALITY, KONDAPALLI.

తుపాను బీభత్సం

• నిండా మునిగిన రైతన్న • కృష్ణాజిల్లాలో 1.73 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం • స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మిచాంగ్ తుపాను బీభత్సం సృష్టించింది. బాపట్ల వద్ద మంగళవారం సాయంత్రం తీరం దాటిన తర్వాత పెనుగాలులు వీచాయి. భారీ వర్షాలు కురిశాయి. మూడు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు, కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణాజిల్లా అతలాకుతలమైంది. పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. జిల్లావ్యాప్తంగా 1,73,312 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. జనజీవనం స్తంభించింది.

నిండా మునిగిన రైతు

జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో 3 లక్షల 74 వేల ఎకరాల్లో వరి పంట సాగతుండగా 85 వేల ఎకరాల్లో కోతలు, నూర్పిళ్లు పూర్తయ్యాయి. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి రైతులు సమస్యలను ఎదుర్కొన్నారు. ఈదురుగాలలకు జిల్లాలోని అత్యధిక విస్తీర్ణంలో వరి పంట నేలవాలింది. కోతకు వచ్చిన, పాలుపోసుకునే దశలో ఉన్న వరి పొలాలు నెలవాలాయి. గింజ తయారైన వరి పొలాల్లో నేలవాలండం, పొలాల నిండా నీళ్లు ఉండటంతో కంకులు నాని గింజలు మొలకలొస్తాయిని, దివిసీమ, కృత్తివెన్ను తదితర ప్రాంతాల్లో పాలుపోసుకునే దశలో ఉన్న వరి పొలాలు కనీస దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 417 గ్రామాల్లో వివిధ రకాల పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ ప్రాధమిక అంచనాల ప్రకారం అత్యధికంగా 1,68,464.35 ఎకరాల్లో వరి, 2,116.21 ఎకరాల్లో వేరుశనగ, 1,444.67 ఎకరాల్లో మినుము, 525 ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 1,72,550 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాధమికంగా అంచనా వేశారు. ఉద్యానవన పంటలకు సంబంధించి 62 ఎకరాల్లో అరటి పంట పడిపోయింది. 700 ఎకరాల్లోని కూరగాయ పంటల్లో నీరు నిలిచి కుళ్లిపోతున్నాయి.

పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు, కాల్వలు

నీట మునిగిన వరి పొలాలు, కూరగాయతోటల్లోని నీటిని వెలపలకు పంపేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. భారీ వర్షాలకు పంట కాల్వలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పొలాల్లోని నీరు బయటకు వెళ్లడం లేదు. ఈనేపథ్యంలో పంటల నష్టం పెరుగుతుందని రైతులు వాపోతున్నారు.

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ఈదురుగాలులు, భారీ వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గృహాలు, విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు పడిపోయాయి. మచిలీపట్నం మండలంలో అత్యధికంగా 55 గృహాలు, అవనిగడ్డలో మూడు, నాగాయలంకలో రెండు, పమిడిముక్కలలో ఒకటి, కంకిపాడులో మూడు, కోడూరులో రెండు, కృత్తివెన్నులో రెండు చొప్పున మొత్తం 68 గృహాలు దెబ్బతిన్నాయి. పోరంబోకుల్లో నిర్మించుకున్న గృహాలను నష్టం అంచనాల్లో అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. 87 ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆర్అండ్‌బి రహదారులకు అడ్డుగా చెట్లు పడిపోయాయి. 10 ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

స్తంభించిన జన జీవనం

జలదిగ్బంధనంలో బందరు

తుపాను ప్రభావంతో జిల్లాలో జనజీవనం స్తంభించింది. అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. మచిలీపట్నం నగరంతోపాటు గుడివాడ, పెడన, తాడిగడప, ఉయ్యూరు తదితర పట్టణాల్లో అత్యధిక దుకాణాలు, హోటల్స్ తెరుచుకోలేదు. ప్రధాన కూడళ్లలో స్వల్పంగా మాత్రమే దుకాణాలు తెరిచారు. కొన్ని రైతు బజార్లలో కూరగాయల అమ్మకాలు నిలిపివేశారు. తోపుడు బళ్లు రోడ్డెక్కలేదు. నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వాహన రవాణా తగ్గిపోయింది. దీంతో లోడింగ్, అన్‌లోడింగ్ చేసే ముఠా, భవన నిర్మాణ కార్మికులు, వేటకు వెళ్లే అవకాశం లేక మత్స్యకారులు తమ రోజువారీ ఆదాయాలు కోల్పోయారు. జిల్లావ్యాప్తంగా ఉన్న డిపోల్లో 445 బస్సు సర్వీసుల్లో 345 సర్వీసులు మాత్రమే నడిపారు. వివిధ రూట్లలో పూర్తిగా బస్సులు నిలిపివేశారు. రోజువారీ 65 శాతం ఉండే ఆర్టీసీ సర్వీసుల ఆక్యుఫెన్సీ సర్వీసుల తగ్గించినా 45 శాతానికి పడిపోయింది.

జలదిగ్బంధంలో బందరు

బందరులో డ్రైనేజీ సమస్య పరిష్కారం కావడంలేదు. డ్రైనేజీల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భారీ వర్షాలకు బందరు జలదిగ్బంధంలో చిక్కుకుంది. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు ప్రధాన రహదారి పూర్తిగా మునిగిపోయింది. లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి మార్కెట్ యార్డు రోడ్డు వరకు బైపాస్ రోడ్డు, సుకర్లాబాదు, ఇంగ్లీషుపాలెం, సుందరయ్యనగర్, డ్రవర్స్‌కాలనీ, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు నీట మునిగాయి. బందరు బస్టాండ్‌లోనూ మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. ద్విచక్రవాహనాల్లోని ఇంజన్లలోకి నీరు చేరి నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



కిట్లు అందజేస్తున్న తేజ, తదితరులు

సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలో మండల అధ్యక్షుడు పోలిశెట్టి తేజ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్ (గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సైనికులే జనసేన పార్టీకి ప్రధాన బలంగా పనిచేస్తున్నారని రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ. మండల స్థాయిలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జన సైనికులు మరింత ఉత్సాహంగా ప్రజా సమస్యలపై పోరాడాలని గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతనకొండ జనసేన పార్టీ అధ్యక్షులు కొమ్మూరు వెంకటస్వామి, కొండపల్లి మున్సిపాలిటీ నాయకులు చెరుకుమల్లి సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు

విపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి

వైసిపి తూర్పు ఇన్చార్జి దేవినేని అవినాష్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వం లో జనరంజక పాలన అందిస్తుంటే చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ,దాని తోక పార్టీలు రాజకీయ లబ్ది కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నాయని వాటిని త్రిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలను వివరించే బాధ్యత పార్టీ నాయకులదే అని తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్ ఛార్జ్ దేవినేని అవినాష్ ఆ పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 15,19 డివిజన్ ల పార్టీ కార్యాలయలలో ఆయా డివిజన్ ల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అవినాష్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని, అమలు చేస్తున్న సంక్షేమాభివద్ధి కార్యక్రమాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని పార్టీకి మరింత చేరువ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో 15 వ డివిజన్ కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ,19 వ డివిజన్ కార్పరేటర్ రెహానా, మాజీ డిప్యూటీ మేయర్ అల్లా చల్లారావు కోఆప్షన్ సయ్యద్ అలీమ్, 19 వ డివిజన్ ప్రెసిడెంట్ జగ్గ విజయ్, 15 డివిజన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, భుజంగరావు, కొండ మేస్త్రి, శ్రీనివాస్, ఖాదర్ భాయ్, విస్సు, సూరి, హరీష్, బాలాజీ, చిన్న, రవి, నరసింహారావు, రెహమాన్, సత్యనారాయణ వలి. %బాఎ%, వెంకటేశ్వరరావు, %ంఎ%. సుభాని,అలీ, అహ్మద్ షరీఫ్, ఉస్మాన్, జావిద్ పటాన్ ఖాన్, పోతురాజు, రాము, యేసు రాజు, సలీమ్, అనీత,రతన కుమారీ, నాగ లత, రమ అదిల్ రంగ, ఇంతియాజ్, సలీమ్, అలీ భాయ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవినేని అవినాష్



నందిగామలో పూర్తిగా మునిగిన డ్రెయినేజీ

స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - నందిగామ : తుపాను ప్రభావంతో నందిగామ పట్టణంలో జనజీవనం స్తంభించింది. తెల్లవారుజాము నుండి రాత్రి పొద్దు పోయే వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నందిగామలో డ్రైనేజీలు పూర్తిగా నీట మునిగి రోడ్లపైకి వరద పారటంతో, రహదారులు చెరువులను తలపించాయు. నేతాజీ నగర్‌లో ప్రధాన డ్రైనేజీ నిర్మాణంలో వుండటంతో అధికారులు అడ్డుకట్ట వేయటం వల్ల వరద నీరు ఎగదన్నింది. దీంతో ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. నందిగామ 16 వ వార్డ్‌లో లోతట్టు ప్రాంతాల్లో వరద చేరి చెరువులను తలపించాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎపి పిటిడి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలో ఎంఎల్ఎ విష్ణు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎపి పి.టి.డి (ఆర్టీసీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు పి.కిరణ్ బుజ్జి, ప్రధాన కార్యదర్శి బి.వి.ఎస్.నారాయణ ఆధ్వర్యంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, సెంట్రల్ నియోజకవర్గం శాసన సభ్యులు మల్లాది విష్ణు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. తొలుతగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్‌రావుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ బుజ్జి, నారాయణలు మాట్లాడుతూ సంఘ అభివద్ధికి, సంఘ సభ్యులకు చేసిన సేవలను వివరించారు, అలాగే తీవ్ర తుఫాన్‌లో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల నుంచి సభకు విచ్చేసిన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్య అతిధి పశ్చిమ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులపై ప్రేమతో, అభిమానంతో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం జరిగిందని, విలీన చేయడం ద్వారా, లాభ నష్టాలతో సంబంధం లేకుండా ప్రతి నెల జీతాలు అందుతున్నాయని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు మాట్లాడుతూ పక్క రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగులు ఏ



అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలవేస్తున్న ఏపీ పిటిడి ఎస్సీ, ఎస్టీ నాయకులు

విధంగా ఇబ్బందులు పడ్డారో మనందరం చూస్తున్నామని, అలాంటి సమయంలో మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా 52 వేల మంది ఉద్యోగులకు మేలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను మా దృష్టికి తీసుకొని వస్తే సమస్యలు పరిష్కారానికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మహాసభ ఈరోజు ఎంత ఘనంగా నిర్వహించిన అధ్యక్ష కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి.పి.టి.టి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ శేషగిరిరావు, దళిత సంఘాల నాయకులు, అసోసియేషన్ రాష్ట్ర, జోన్, జిల్లా నాయకులు సభ్యులు హాజరయ్యారు.



దుర్గగుడి అధికారులు ఘాట్‌రోడ్డులోకి అనుమతి లేదని ఏర్పాటుచేసిన బ్యానర్

దుర్గగుడి ఘాట్‌రోడ్డు తాత్కాలికంగా మూసివేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తుఫాన్ ప్రభావంతో గత 24 గంటలుగా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలు కారణంగా కొండ రాళ్లు పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా దుర్గమ్మ దేవస్థానంకు వచ్చే భక్తుల వాహనాల రాకపోకలు నిలుపుదల చేసినట్లు ఇఓ తెలిపారు. కురుస్తున్న వర్షాల కారణంగా భక్తుల భద్రత దష్ట్యా దేవస్థానం వారు ముందస్తుగా ఘాట్ రోడ్ ద్వారా వాహనాలు నిలుపుదల చేశామన్నారు. ఆలయానికి విచ్చేయు భక్తులందరూ మహామండపం మార్గంను వినియోగించుకోవాలని కోరారు.


52వ డివిజన్ కొండ ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, విఎంసి అధికారులు

52వ డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవరగం 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) తుఫాను సందర్భంగా కురుస్తున్న వర్షాలు కారణంగా కొండ ప్రాంతంలో నివసించే ప్రజల ఇబ్బందులు తెలుసుకునేందుకు మంగళవారం పర్యటించారు. కార్పొరేటర్ చంటితో పాటు నగరపాలక సంస్థ జోనల్ ఆఫీసర్ రవిచంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చెన్నా రాజు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ రమణతో కలిసి డివిజన్‌లోని కొండ ప్రాంతంలో పర్యటించారు. కొండ ప్రాంతంలో నివసించే వారికి ఎటువంటి అసౌకర్యం కలిగిన తెలియచేయాలని, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటామని వారు తెలియజేశారు.

మార్కెట్లోకి టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ అయిన టాటా మోటార్స్ సరికొత్తగా ఇంట్రా వి70, ఇంట్రా వి 20 గోల్డ్ వాణిజ్య వాహనాలను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి ఎ.రాజ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా నగరంలోని టాటా మోటార్స్ నందు వాహనాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకొత్త వాహనాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని అధిక లాభాలతో పాటు ఉత్పాదకతను అందిస్తాయని తెలిపారు. టాటా మోటార్స్ తన ప్రసిద్ధ ఇంట్రా వి50, ఏస్ డీజిల్ వాహనాలను కూడా త్వరలో ఆవిష్కరించనుందని తెలిపారు. ఈకొత్త ఆవిష్కరణలతో టాటా మోటార్స్ విస్తృత శ్రేణిలో చిన్న వాణిజ్య వాహనాలు, పికప్‌లను అందిస్తుందని తెలిపారు. ఈవాహనాల బుకింగ్‌లు అన్ని టాటా మోటార్స్ సీవీ డీలర్‌షిప్‌లలో ప్రారంభమయ్యాయని తెలిపారు.

టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ

యూత్ అండర్ -13 విజేత ఆకాష్ రాజవేలు



విజేతలైన విద్యార్థులకు బహుమతులిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ అండర్ -13 యూత్ బాలుర విభాగంలో తమిళనాడుకు చెందిన ఆకాష్ రాజవేలు, బాలికల విభాగంలో అంకోలియా చక్రవర్తి టైటిల్‌ను సాధించారు. పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఫైనల్స్ పోటీలు జరిగాయి. ఇందులో బాలురు ఫైనల్స్‌లో ఆకాష్ రాజవేలు (తమిళనాడు) 3-11, 11-4, 11-5, 12-10 పాయింట్లతో అరవ్ ఆచార్య పై విజయం సాధించి టైటిల్‌ను సాధించాడు. అలాగే బాలికల విభాగంలో అంకోలికా చక్రవర్తి (వెస్ట్ బెంగాల్) 11-4, 11-7, 11-4 పాయింట్లతో ప్రతీతి పాల్ (వెస్ట్ బెంగాల్)పై విజయం సాధించి టైటిల్‌ను సాధించింది. అండర్ -11 బాలుర విభాగంలో ఎం.అశ్వజిత్ (తమిళనాడు) 11-5, 12-10, 8-11, 11-8 పాయింట్లతో మనవిత్ (ఎపి)పై విజయం సాధించి టైటిల్‌ను సాధించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలకు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ప్రకాష్, జనరల్ సెక్రటరీ పి.విశ్వనాథ్, టేబుల్ టెన్నిస్ ఫెడరేషణ్ ఆఫ్ ఇండియా కో ఆర్డినేటర్ గణేశన్ బహుమతులను అందచేశారు.



విజేతకు బహుమతులిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి పోటీలకు కెబిఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తమ కళాశాల ఇంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్- 19 హ్యాండ్‌బాల్ లోను, నెట్బాలోను అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టినందుకు మంగళవారం కళాశాలలో వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.నారాయణరావు మాట్లాడుతూ త్వరలో జరగబోయే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గౌతమ్, శ్రావణి, సత్య అలాగే నెట్ బాల్‌లో అజాముద్దీన్ ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాస్, ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్ పిఎల్ రమేష్ తదితరులు విద్యార్థులను తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుని అభినందించారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కెబిఎన్ కళాశాల యాజమాన్యం

ప్రపంచ నేల దినోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఎం.జి.రోడ్డులోని పైలట్ సర్వీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వినియోగదారులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేసినట్లు పైలెట్ సర్వీస్ స్టేషన్ మేనేజర్ కె.వెంకటప్పయ్య తెలిపారు. మొక్కలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపతడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అలాగే మన నేలకు మనం రక్షించుకోవాలనే ఉద్దేశంతోనే తమ పెట్రోల్ బంకుకు వచ్చే వినియోగదారులకు ఉచితంగా మొక్కలను అందజేసినట్లు తెలిపారు. పైలట్ సర్వీస్ స్టేషన్ వినియోగదారులకు సేవలను అందించడంతో పాటు పలు సామాజిక, సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీలర్ ఎం.వి.వి సత్యనారాయణ, ఐవోసి సేల్స్ ఆఫీసర్ కె. వరప్రసాద్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు అందజేస్తున్న దృశ్యం

ముంపు ప్రాంత వాసులకు భోజనాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తుఫాను కారణంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలను శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ మంగళవారం ఉదయం పర్యటించారు. కామినేని నగర్, డొంకరోడ్డులో వర్షం కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను పర్యటించడంతో పాటు వారితో మాట్లాడారు. ముంపు ప్రాంతాలలో ఉండే వారికి ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజనాన్ని అందచేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే కామినేని నగర్, డొంకరోడ్డులో వరదల వల్ల వర్షం నీరు ఇళ్లలోకి రాకుండా రోడ్డు వేసి పూర్తి స్థాయిలో డ్రైనేజి సౌకర్యం కల్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న గద్దె రామ్మోహన్



అప్రమత్తంగా ఉండండి : ఎంఎల్ఎ వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తుఫాన్ నేపథ్యంలో పశ్చిమ ప్రజలు ముం దస్తు జాగ్రత్తలు పాటిం చాలని మాజీ మంత్రి, పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు వెలం పల్లి శ్రీనివాస రావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎక్కువగా కొండప్రాంతం వున్నందున ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఎదురు అవుతున్నాయా అని ఉదయం నుండి ఆయా డివిజన్ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జిలతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇళ్ళమధ్య, బహిరంగ ప్రదేశాల్లో నీళ్ల నిల్వ లేకుండా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుద్ధ్య చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. విద్యుత్తు స్తంభాలు, తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు.



జాగ్రత్తగా ఉండండి : టిడిపి

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో పశ్చిమ ప్రజలు అప్రమత్తంగా వుండి ప్రమాదాల బారినుండి సురక్షితంగా వుండాలని తెలుగుదేశం పశ్చిమ నాయకులు ఎం.ఎస్. బేగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇళ్ళమధ్య, బహిరంగ ప్రదేశాల్లో నీళ్ల నిల్వ లేకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. అలాగే ప్రజలు విద్యుత్తు స్తంభాలు, తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు.